ప్రజాశక్తి

శనివారం 6 జనవరి 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

అధికారంలోకి వచ్చిన

తొలి ఏడాదిలోనే వెలుగొండ పూర్తి

- 'మార్కాపురం'ను జిల్లా చేసి.. పశ్చిమ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా..
- కనిగిరి ప్రజలు సంపన్నులయ్యేలా అవకాశాలు కల్పిస్తా..
- మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-కనిగిరి, ఒంగోలు బ్యూరో

కనిగిరి ప్రాంత ప్రజల నీటి కష్టాలు తెలుసని, తాను శ్రీకారం చుట్టిన వెలుగొండ ప్రాజెక్టుని అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పూర్తి చేసి.. పశ్చిమ ప్రకాశం.. అందులోని కనిగిరిని సస్యశ్యామలం చేస్తామని మాజీ సిఎం, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కనిగిరి ▶ 2లో



మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఉగ్ర నరసింహారెడ్డి



కనిగిరిలో బహిరంగ సభకు హాజరైన టిడిపి శ్రేణులు, ప్రజలు



బాపట్లలో చేతులతో కళ్లు మూసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ధృతరాష్ట్ర పాలనలా ఉంది..

కళ్లు మూసుకొని అంగన్‌వాడీల నిరసన

▶ 8లో



మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

అబద్ధాలు చెప్పటంలో

ప్రపంచంలోనే మొదటిస్థానం 'మోడీ'దే..

సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

▶ 3లో



ఇద్దరికి కరోనా

ఆర్‌టిపిసిఆర్ టెస్టులో పాజిటివ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో చేసిన ఆర్‌టిపిఎస్‌ఆర్ టెస్టుల్లో ఇద్దరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్, సిఎస్‌ఆర్‌ఎంఒ డాక్టర్ బి.తిరుమలరావు తెలిపారు. ఒంగోలు నగరం, దేవుడుచెరువుకు చెందిన యువకుడికి (ఏపి ఫైబర్‌నెట్‌లో హెల్పర్), మద్దిపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఈ నెల నాలుగో తేదీన పరీక్ష చేయగా ఐదో తేదీన వచ్చిన టెస్టుల్లో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని చెప్పారు. ఈ మేరకు వీరికి సమాచారం అందించి తగు జాగ్రత్తలు వైద్యుల సలహా మేరకు తీసుకోవాలని సూచించామన్నారు. దేవుడుచెరువు కు చెందిన యువకుడు జిజిహెచ్‌లో కోవిడ్ షెడ్‌లో (కరోనా టెంపరరీ హాస్పిటల్) చికిత్స పొందుతున్నాడని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మద్దిపాడులో తన ఇంటిలో ▶ 2లో

పోటీ నుంచి

తప్పుకున్న 'శిద్దా'

- బాలినేనిని కలిసి నిర్ణయాన్ని చెప్పిన 'సుధీర్'
- సిఎంతో గిద్దలూరు, దర్శి ఎమ్మెల్యేల భేటీ
- హైదరాబాద్‌లో బాలినేనిని కలిసిన మాగుంట



శిద్దా సుధీర్, రాఘవరావు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలులో పోటీ చేయలేమని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తేల్చేశారు. ఇదే విషయాన్ని వైసిపి పెద్దలకు చెప్పేశారు. ఒంగోలు అసెంబ్లీకి పోటీచేయాలని సిఎం జగన్ తాడేపల్లికి పిలిచి చెప్పారు. రెండు రోజులు సమయం అడిగిన శిద్దా ఇక్కడ పోటీ చేయడానికి ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేశారు. సన్నిహితులు, కుటుంబసభ్యులు, రాజకీయ మిత్రులతో మంతనాలు సాగించారు. ఇక్కడ పరిస్థితులు సానుకూలంగా లేవనే అభిప్రాయం ఎక్కువ మంది నుంచి వచ్చింది. దీంతో తర్జనభర్జనల అనంతరం శిద్దా రాఘవరావు కుమారుడు సుధీర్‌బాబు శుక్రవారం నాడు హైదరాబాద్‌లో ఉన్న మాజీ మంత్రి బాలినేనితో భేటీ అయ్యారు. తాము పోటీలో ఉండలేమని ఆయనకు చెప్పారు. దర్శి ఇస్తే తప్ప ఇతర నియోజకవర్గాల్లో పోటీ చేయలేమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకుపోతామని బాలినేని వెల్లడించారు. ఇదే విషయాన్ని పార్టీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి తెలియజేశారు. రెండు, మూడు రోజులుగా శిద్దా రాజకీయ భవితవ్యంపై సాగుతున్న ఉత్కంఠభరిత చర్చలకు తెరపడింది. ఇదిలా ఉండగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కూడా హైదరాబాద్ వెళ్లి బాలినేనితో భేటీ అయ్యారు. వారిద్దరి మధ్య పార్లమెంటు టిక్కెట్టు విషయంపైనే చర్చ సాగింది. పార్టీ ఆలోచన ఎలా ఉంది? అనే దానిపైనా ఆరా తీశారు. ఇదే సమయంలో వీరిద్దరినీ ఒంగోలు కార్పొరేషన్



సిఎంను కలిసిన అన్నా రాంబాబు

అభిమానం..



కనిగిరి బహిరంగసభలో చంద్రబాబుపై అభిమానంతో గొర్రెపిల్లను బహూకరించిన ఓ వ్యక్తి

ఆనందం..



చంద్రబాబును చూసిన ఉత్సాహంలో విజిల్ వేస్తున్న మహిళ - ప్రజాశక్తి-కనిగిరి

అధికారంలోకి వచ్చిన..
తొలి ఏడాదిలోనే 'వెలుగొండ' పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

పట్టణంలోని వెలుగొండ సాధన ప్రాంగణంలో ఎన్నికల సమర శంఖారావాన్ని ఆయన పూరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో జరిగిన యువగళం ముగింపు సభ కంటే ఎక్కువగా ప్రజలు కనిగిరిలో రావటం, అఖండ స్వాగతం పలకడం విజయానికి సంకేతమన్నారు. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రజలందరూ నరకం అనుభవిస్తున్నారని, ఈ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని అన్నారు. నూతన సంవత్సరం సంక్రాంతి సందర్భంగా సైకో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలన్నారు. ప్రకాశం జిల్లా పౌరశాల గడ్డ అని, బ్రిటిష్ వారి తుపాకీ గుండుకు రొమ్ము విరిచి చూపిన ప్రకాశం పంతులు పుట్టిన గడ్డ అని, అందుకే ఈ గడ్డ నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించడం జరిగిందని పేర్కొన్నారు. కనిగిరిలో ఉన్న పేదలు అవకాశాలు లేక వలసలు పోతున్నారని, అలా వలసలు పోకుండా సంపన్నులయ్యేలా అవకాశాలు కల్పించేలా కనిగిరి దశ దిశ మార్చుతానన్నారు. తాము ఫలానా అభివద్ధి చేశామని చెప్పలేని దుస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. మందు బాబులకు శుభవార్త అని.. ధరలు తగ్గించి నాణ్యమైన మందు అందేలా చూస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలను, ఎంపీలను ఒక చోట నుంచి మరోచోటికి ట్రాన్స్ఫర్ చేస్తున్నారని, ఒక ఇంటిలో పనికిరాని చెత్తను మరో ఇంటిలో వేస్తే ప్రజలు ఆదరిస్తారా? అని ప్రశ్నించారు. ఈ పార్లమెంటు పరిధిలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండగా బుర్ర మనీసూధన్‌గా మారి అన్నిట్లో వాటాలంటూ దోపిడీ చేస్తున్నాడని, ఆయనను ఎందుకు మార్చలేదని ప్రశ్నించారు. యర్రగొండపాలెంలో బట్టలిప్పి తిరిగిన మంత్రిని కొండపికి ట్రాన్స్ఫర్ చేశారన్నారు. మార్కాపురంలో నయీమ్, అతని తమ్ముడు చోటా నయీమ్‌గా మారారన్నారు. గిద్దలూరులో పోటీ చేయలేక పారిపోయాడన్నారు. దర్శిలో సీటు లేదు పొమ్మన్నారని చెప్పారు. ఒంగోలు, జిల్లా, రాష్ట్రం అంతా నాదే అన్న మంత్రి అడ్రస్ గల్లంతయిందన్నారు. ఇదా రాజకీయమని ప్రశ్నించారు. నాయకుడు తప్పు చేసి ఎమ్మెల్యేలను బలిపశువులను చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ, ఎమ్మెల్యే సీటు కావాలంటే చంద్రబాబును తిట్టిన వారికే ఇస్తాననటం దురదష్టకరమన్నారు. కొంతమంది ఆ పని చేయలేక సీట్లు వదులుకోవడానికి సిద్ధపడుతున్నారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే ధరలకు రెక్కలు విరిగి.. తగ్గుతాయన్నారు. నేటి ప్రభుత్వ హయాంలో సర్పంచులకు వాలంటీర్లకున్న గౌరవం కూడా లేదని, తాము అధికారంలోకి రాగానే గౌరవం పెంచి అధికారాలు ఇస్తామన్నారు. కనిగిరిలోనే ట్రిబుల్ ఐటీ కళాశాల నిర్మిస్తామని, నిమ్స్ ఏర్పాటుతో పాటు నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్ పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. కనిగిరి ప్రజలకు ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా రక్షిత జలాలు అందించి ఫ్లోరైడ్ రక్కసి నుంచి కాపాడతామన్నారు. ప్రకాశం జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. మార్కాపురంను జిల్లాగా చేసి అందులో కందుకూరును కలిపి ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా అభివద్ధి చేస్తామన్నారు. ఒంగోలు, కందుకూరు, మార్కాపురం, కనిగిరిలో టిడ్కో గహాలను తాము నిర్మిస్తే వైసిపి సిగ్గులేకుండా రంగులేసుకుందని, కానీ లబ్ధిదారులకు పంపిణీ చేయలేదని అధికారంలోకి వచ్చిన వెంటనే తాము పంపిణీ చేస్తామన్నారు. ఆక్వా, గ్రానైట్ ఫార్మా రంగాలు అభివద్ధి చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ ప్రాంతంలో భూ కబ్జాలు జరిగాయని ప్రత్యేక సిట్ వేసి అక్రమార్కుల భరతం పడతామన్నారు. జగన్ తీసుకువచ్చిన కొత్త భూచట్టం లోపభోయిష్టంగా ఉందని, దానిని ఉపసంహరించి ప్రజల భూములకు రక్షణ కల్పిస్తామన్నారు. ఒంగోలులో అమత్ పథకం కింద 80 శాతం పూర్తి అయిన పనులను తాము తిరిగి పూర్తి చేస్తామన్నారు. రాజధాని లేని రాష్ట్రాన్ని చేశారని రాజకీయాలకు అనరుడైన సీఎం జగన్‌ని శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డోలా బాల వీరాంజనేయ స్వామి, ఏలూరి సాంబశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్, కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, దామచర్ల సత్య, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నూకసాని బాలాజీ పాల్గొన్నారు.

పెరిగిన పింఛన్లు పంపిణీ చేసిన అధికారులు

ప్రజాశక్తి-కొత్తపట్నం

మడనూరు-1 మరియు 2 గ్రామ సచివాలయాలకు సంబంధించి పెంచిన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. వాటితో పాటు కొత్తగా మంజూరయిన పింఛన్లు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఒ డాక్టర్ పి సుజాత, మడనురు గ్రామ సర్పంచ్ గంగవరపు కోటేశ్వరావు, సచివాలయ కన్వీనర్లు, గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గతంలో 2,750/- రూపాయలు తీసుకుంటున్న వారికి 3,000/- రూపాయలు, కొత్తగా పెన్షన్ మంజూరు అయిన వారికి 3,000/- రూపాయలు గ్రామ పెద్దల చేతులు మీదుగా అందజేశారు.

పోటీ నుంచి తప్పుకున్న 'శిద్దా'

(మొదటిపేజీ తరువాయి)

మేయర్ సుజాతతో పాటు డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, మాధవరావు, కార్పొరేటర్లు కలిశారు. ఒంగోలులోనే పోటీ చేయాలని బాలినేనిని కోరారు. ఇళ్లస్థలాలు ఇస్తే ఒంగోలులోనే పోటీ చేస్తామని బాలినేని వీరికి హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా తాడేపల్లిలో సిఎం జగన్‌ను ఇద్దరు ఎమ్మెల్యేలు కలిశారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నారాంబాబు కలిసి తాను పోటీ నుంచి తప్పుకుంటున్నట్లుగా చేసిన ప్రకటనకు కారణాలను, పరిస్థితులను వివరించారు. పార్టీ నేతల నుంచి తనకు ఎదురైన చేదు అనుభవాలను సిఎం జగన్‌కు వివరించారు. తిరిగి పోటీ చేయాలని గానీ సిఎం జగన్ చెప్పలేదు. అదేవిధంగా తనకు టిక్కెట్టు ఇవ్వాలని కూడా అన్నా రాంబాబు అడగలేదు. తర్వాత కలుద్దామని సిఎం జగన్ అనడంతో అన్నా బయటకు వచ్చారు. వెంటనే దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కలిశారు. దర్శిలో టిక్కెట్టు ఇవ్వడం సాధ్యం కాదని సిఎం జగన్ ఆయనకు చెప్పినట్లు సమాచారం. అదే సమయంలో ఒంగోలులో పోటీ చేయాలని సూచించారని ప్రచారం సాగుతోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఇద్దరికి కరోనా

(మొదటిపేజీ తరువాయి)

ఇసొలేషన్‌లో ఉన్నారని తెలిపారు. సంబంధిత సమాచారం జిల్లా వైద్య అధికారికి, స్థానిక వైద్య అధికారులకు తెలియజేశామన్నారు. ఈ రెండు నమూనాలను జీనోమ్ ల్యాబ్‌కి పంపుతానని తెలిపారు.

అబద్ధాలు చెప్పటంలో ప్రపంచంలోనే మొదటిస్థానం 'మోడీ'దే..

- దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న ప్రధాని
- 12న విజయవాడలో జరిగే సభను జయప్రదం చేయండి
- సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అబద్ధాలు చెప్పి నమ్మించడంలో ప్రపంచంలోనే మొదటి స్థానం ప్రధాని నరేంద్ర మోడీదని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజమెత్తారు. స్థానిక ఆచార్య రంగా భవనంలో శుక్రవారం ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన విజయవాడలో నిర్వహించే భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభ సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఫలాలు అర్హులకు దక్కేలా, అందరూ సోదర భావంతో మెలిగే లక్ష్యంతో అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాశారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ పాలన చేయడం ప్రారంభించిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజలకు ఉన్న రక్షణ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. దేశ సంపదను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం మెజార్టీ సభ్యుల బలం లేకుండా అదానీ కార్యాలయంలో తయారుచేసిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను, విద్యుత్ సంస్కరణలు-2022ను తెచ్చి ప్రజలపై రుద్దటానికి ప్రయత్నించారన్నారు. దేశంలోని 12 పోర్టులు, ఆరు ఎయిర్‌పోర్టులను నిబంధనలకు విరుద్ధంగా అదానీకి హస్తగతం చేశారన్నారు. విద్యుత్ రంగంలో ఎటువంటి అనుభవం లేని అదానీకి 50 వేల మెగావాట్ల విద్యుత్ తయారు చేసుకునేలా అనుమతులు ఇవ్వటంతో పాటుగా, విద్యుత్ లైన్లను, విద్యుత్ డిస్కమ్‌ను అప్పగించారన్నారు. 25 కోట్ల విద్యుత్ స్మార్ట్ మీటర్లను తయారుచేసి వ్యవసాయ విద్యుత్ మోటార్లకు, గృహ వినియోగానికి, అన్ని రకాల విద్యుత్ అవసరాలకు బిగించేలా అదానీకి బిజెపి ప్రభుత్వం అనుమతులు ఇచ్చి ప్రజా సంపదను దోచి పెట్టేలా రంగం సిద్ధమైందన్నారు. 13 నెలల ఢిల్లీ రైతాంగ ఉద్యమంతో దిగివచ్చిన మోడీ ప్రభుత్వం రైతాంగానికి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. 2024 ఎన్నికలలో తిరిగి బిజెపి అధికారంలోకి వస్తే మనువాద రాజ్యాంగాన్ని అమలులోకి తెస్తారన్నారు. భేటీ బచావో, భేటీ పడావో అంటూనే దేశంలోని మహిళలను చిన్నచూపు చూస్తున్నారన్నారు. పతకాలు సాధించిన భారత మహిళ రెజ్లర్లు తమకు శారీరక వేధింపులు జరిగాయని ఢిల్లీ నగరంలో నెలల తరబడి రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసినా ప్రధాని నోరు విప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి హటావో, దేశ్ బచావో నినాదంతో ఈ నెల 12వ తేదీన విజయవాడ నగరంలో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నట్లు, ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలలో కేంద్రంలోని బిజెపితో పాటు రాజకీయ పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించి దేశాన్ని కాపాడుకోవాలని కోరారు. యూత్ ఫర్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షురాలు యు.వేదవతి మాట్లాడుతూ పాలకులు ప్రభుత్వ రంగం కన్నా ప్రైవేట్ రంగం మంచిదన్న తీరుగా ప్రజలలో విష బీజాలు నాటుతున్నారన్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మేధావులపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో నరహంతకుల పాలన సాగుతుందన్నారు. రానున్న ఎన్నికలలో బిజెపి దాని అనుబంధ రాజకీయ పార్టీలను తరిమితరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ పేదలకు పట్టెడు అన్నం పెడుతున్న ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించుకుంటా నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం 60 వేల కోట్లు ఇచ్చారన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ స్వామి నాథన్ కమిషన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షోభం రంగంలో ఉన్న వ్యవసాయ రంగం, రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం ఏరువాక పూర్ణిమ కార్యక్రమంలో పాల్గొన్న లింగంగుంటకు చెందిన రైతు మంగమూరి ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు, ఏపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె మాబు, వి బాలకోటయ్య, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వడ్డే హనుమారెడ్డి, వీరారెడ్డి, ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక నాయకురాలు అరుణ, ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, ఏపి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలిత కుమారి, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రానైట్ కార్మికుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

గ్రానైట్ కార్మికుడు అనుమానాస్పదం స్థితిలో మృతిచెందిన ఘటన శుక్రవారం మార్టూరులో వెలుగు చూసింది. అందిన వివరాలు ప్రకారం.. స్థానిక నాగరాజు పల్లి రోడ్డు లోని వి ఆర్ గ్రానైట్స్‌లో అస్సాం రాష్ట్రానికి చెందిన సోమ్ దాస్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇద్దరు యువకులు రక్తపు గాయాలతో తీవ్రంగా గాయపడి ఉన్న సోమదాసుని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. ప్రమాదం ఎలా జరిగిందని హాస్పిటల్ సిబ్బంది వారిని ప్రశ్నించగా గుర్తుతెలియని వాహనం ఢీకొందని, గ్రానైట్ ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు గాయపడ్డాడని పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వైద్య సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ముసలం శ్రీనివాసరావు హాస్పిటల్ కి చేరుకొని మతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



క్వారీలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గుర్తుతెలియని వ్యక్తి మతదేహం వెలుగుచూసిన ఘటన మండల పరిధిలోని రాయవరం గ్రామ సమీపంలోని పలకల క్వారీలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మార్కాపురం గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి యొక్క మతదేహం పలకల క్వారీలో పడి ఉన్నట్లు మార్కాపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ కు సమాచారం రావడం జరిగిందన్నారు. దీంతో సమాచారం అందుకున్న శిక్షణ డిఎస్పీ మార్కాపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ షేక్ షహబాష్ అహమ్మద్, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని మతదేహాన్ని పరిశీలించారు. మతుడు చనిపోయి దాదాపు పది రోజులు కావస్తుందన్నారు. గుర్తుపట్టలేని విధంగా ఉందన్నారు. ఎవరైనా హత్య చేసి పడవేశారా, లేక మద్యం మత్తులో అతనే పడ్డాడా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. మృతుడు వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదు. మృత దేహం పడి ఉన్న స్థలంకు కూత వేటు దూరంలో మద్యం సీసాలను పోలీసులు గుర్తించారు. దాదాపు రెండు గంటల శ్రమించి 200 అడుగుల లోతులో పడి ఉన్న మతదేహాన్ని క్రేన్ ద్వారా బయటికి తీశారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శిక్షణ డిఎస్పి, మార్కాపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ షేక్ షహబాష్ అహమ్మద్ తెలిపారు.

బైకును ఢీకొన్న లారీ..

వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని గుట్ల ఉమ్మడివరం జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీ కొంది. దీందో బైక్‌పై వెనుక కూర్చొని వెళ్తున్న వినుకొండ మండలం చెరువుకొమ్ముపాలెంకు చెందిన పసుమర్తి వెంకట రమణమ్మ (70) అక్కడికక్కడే మృతి చెందింది. త్రిపురాంతకం మండలంలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. నవరత్నాలు ద్వైవార్షిక మంజూరు కార్యక్రమం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం బటన్ నొక్కి ప్రారంభించారు. తదుపరి అన్ని జిల్లాల కలెక్టర్లు, లబ్ధిదారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రజలకు తోడుగా ప్రభుత్వం నిలుస్తుందని హామీ ఇచ్చారు. తదుపరి జిల్లాలో మంజూరైన లబ్ధిదారులకు స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా నగదు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలకు అర్హత ఉండి లబ్ధి పొందలేని వారందరికీ ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందని కలెక్టర్ చెప్పారు. ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాలు అందలేని వారందరినీ గుర్తించే కార్యక్రమం ఏడాదికి రెండు పర్యాయాలు నిర్వహిస్తున్నామన్నారు. జగనన్న చేదోడు పథకం కింద 429 మంది లబ్ధిదారులకు నగదు మంజూరయిందన్నారు. వైయస్సార్ నేతన్న నేస్తం పథకం కింద 35 మందికి, ఈబీసీ నేస్తం కింద 218 మందికి, జగనన్న అమ్మఒడి కింద 1,127 మందికి, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా కింద 120 మందికి, వైఎస్సార్ కాపు నేస్తం కింద 37 మందికి, వైఎస్సార్ వాహన మిత్ర కింద 56 మందికి, వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాది తోఫా కింద 36 మందికి నగదు మంజురైందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,050 మందికి గానూ రూ 3.01 కోట్ల నగదు విడుదలయ్యిందన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ సిహెచ్.కష్ణ, డిఎల్‌డిఒ సువార్త, డిఆర్‌డిఏ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఓటర్ల అవగాహన కార్యక్రమాలకు నిధులివ్వని ప్రభుత్వం

- అర్హులు ఓటర్లుగా నమోదు కావాలి
- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ జాయింట్ సెక్రటరీ లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భారతీయ ఎన్నికల సంఘం 2009 నుండి ఓటర్ల అవగాహన కోసం 'స్వీప్' అనే చైతన్య కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నా ఆంధ్రప్రదేశ్లో ఇప్పటివరకు ఓటర్లను జాగృతులను చేయటానికి జిల్లా కలెక్టర్లకు ఎలాంటి నిధులు ఇవ్వకపోవడం దురదష్టకరమని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ జాయింట్ సెక్రటరీ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం జరిగిన పాత్రికేయులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12 వరకు ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని 22న ఓటర్ల తుది జాబితా విడుదలవుతుందన్నారు. అప్పటికి ఓటు రాని వారు 15 రోజుల లోపల ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పన లో కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 9,10 తేదీలలో విజయవాడలో జరిగే సమావేశంలో సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం, మరణించిన వారి ఓట్లు తొలగించడం, డబ్లింగ్ ఓట్లు లేకుండా చూడటంలపై వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి నెంబర్ లేకుండా నమోదు అయిన ఓట్లను తొలగించాలని కోరారు. ఒకే ఇంటి నెంబర్ తో పదికి మించి ఓట్లు ఉన్న వాటిని నిశ్చింతంగా పరిశీలించాలన్నారు. నోటీసు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా ఓట్లను తొలగించరాదని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ఓట్లను తొలగించడం శిక్షార్హం అవుతుందన్నారు. ఫారమ్ 8బి ద్వారా 80 సంవత్సరాలు నిండిన వద్ధులకు ఇంటివద్దనే ఓటు వేసుకునే సదుపాయం ఉందని, ఫారమ్ 6ఏ ద్వారా విదేశాలలో ఉన్న భారతీయ పౌరసత్వం గలవారు ఓటు పొందవచ్చునని, ఫామ్ 8 ద్వారా కుటుంబ సభ్యులందరికీ ఓట్లు ఒకే పోలింగ్ బూత్ లో ఉండేటట్లు కషి జరగాలన్నారు. సమావేశంలో వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర చైర్మన్ మావులూరి నాగేశ్వరరావు, ఒంగోలు సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా మధు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ,సుపరిపాలన వేదిక మాజీ అధ్యక్షులు సుంకర సాయిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

క్రీడాకారులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు

డిసెంబర్ 30 నుండి జనవరి 1 వరకు జరిగిన ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్, సింగపూర్, నేపాల్, భారత్ టీంలు పాల్గొన్నాయి. భారత్ - సింగపూర్ ఫైనల్స్ ఆడగా సింగపూర్‌పై భారత్ విజయం సాధించింది. భారత్‌కు విజయాన్ని అందించి.. ప్రకాశం జిల్లాకు నూతన సంవత్సర గిఫ్ట్‌గా ట్రోఫీని అందించిన క్రీడాకారులు ఒంగోలుకు చెందిన తేళ్ల రోహిత్, వెంకట్‌ను శుక్రవారం ఒంగోలులో జరిగిన అభినందన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. క్రీడాకారులని అభినందించిన వారిలో ఉపాస్ హాస్పిటల్స్ డైరెక్టర్ ప్రకాష్ చవల, జిల్లా అసోసియేషన్ చైర్మన్ మారం వెంకారెడ్డి, ప్రెసిడెంట్ ప్రియా, సెక్రటరీ రవి, తేళ్ళ జాన్సన్, మారెళ్ల సుబ్బారావు తదితరులున్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ ప్రకాష్ చవల

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని ఆర్ఎల్‌పురం పంచాయతీ పరిధిలోని గోల్డెన్ గ్రానైట్‌లో పనిచేస్తున్న డి. వెంకటరావు, శివమ్మల కుమారుడు వంశీకృష్ణ వివాహానికి రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మిపద్మావతి దంపతులు ఆర్థిక సాయం అందజేశారు. రాఘవరావు నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సాయం ఇచ్చారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు మాట్లాడుతూ వివాహం సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.


సాయం అందజేస్తున్న శిద్దా

దున్నపోతుకు అంగన్‌వాడీల వినతి


మార్టూరు ధర్నాలో మాట్లాడుతున్న సిహెచ్ గంగయ్య


చీరాలలో మాట్లాడుతున్న సిద్దయ్య


కారంచేడులో దున్నపోతుకు అర్జీ ఇస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - కారంచేడు

ప్రభుత్వం కంటే దున్నపోతు నయం, నయం, ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని, కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు దున్నపోతుకు శుక్రవారం అర్జీ ఇచ్చారు. అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద 25వ రోజు నిరసన తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖ మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి కొండయ్య, ఇంకొల్లు ప్రాజెక్టు అధ్యక్షురాలు హైమావతి, అంగన్‌వాడి నాయకులు అనిత, క్రీస్తు రాజ్యం, శివ లీల, కళ్యాణి, హఫీజ, శ్రీదేవి, జ్యోతి, కృష్ణ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

యద్దనపూడి : అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 25వ రోజు కొనసాగింది. శిబిరం వద్దకు వచ్చిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్ గంగయ్య సంఘీభావం తెలిపారు. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం పట్టించుకోక పోవడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు, జ్యోత్సన, రేవతి, రమ, సుమ, ప్రేమానందం, విజయం, సౌభాగ్యం, రత్న పాల్గొన్నారు.

నిజాంపట్నం : అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 25రోజుల నుండి నిరవధిక చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోగా ఐదో తేదీలోపు విధుల్లో చేరకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు ఉషా అన్నారు. సమ్మె పరిష్కరించకుండా విధులకు హాజరు కావాలని ఇచ్చిన నోటీసులను అంగన్‌వాడీ కార్యకర్తలు దగ్ధం చేశారు.

కొల్లూరు : అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో 25వ రోజు కూడా సమ్మె నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకుండా కలెక్టర్ సమ్మె నిరమించమని, వెంటనే విధుల్లో చేరాలని నోటీసులు ఇవ్వడానికి నిరసనగా అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించే వరకు విధులుకు హాజరయ్యే ప్రసక్తి లేదని కలెక్టర్ ఇచ్చిన కాపీలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మండలంలోని కొనికి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన కొనసాగించారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు హేమ మాట్లాడుతూ 25రోజుల నుండి రాష్ట్రమంతా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్స్ పరిష్కరించాలని తిరుగుతూ ప్రజల మద్దతు కూడగట్టుతున్నట్లు తెలిపారు. చలనం లేని రాష్ట్ర సర్కారు తల లేని మొండెంలాగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రాజెక్టు లీడర్లు బిక్కి సరళ, పి జ్యోతి, అరుణ, అనురాధ, శ్రీదేవి, సంధ్య, అక్కమ్మ, రేవతి, రాజ్యలక్ష్మి, దేవమ్మ, రమాదేవి, కె ఎస్తేరు రాణి, ఆర్ సుజాత పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం చేస్తున్న అంగన్‌వాడీల సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కనీస వేతనాల కోసం అంగన్‌వాడీలు, ఆయాలు రోడెక్కి ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవ్యహరించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు, ఎనికపాటి రాంబాబు, మార్టూరు సెక్టార్ యూనియన్ నాయకులు తాళ్లూరి రాణి, శ్యామల, శాంతి, రాజేశ్వరి, నాగపుష్ప రాణి, కుసుమ, అంకమ్మ పాల్గొన్నారు.

పంగులూరు : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమ్మెకు యుటిఎఫ్ ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల పోరాటానికి సంఘీభావంగా రూ.5వేల ఆర్థిక సహాయంను యూనియన్ ప్రెసిడెంట్‌కు అందజేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు టివీ నరసింహారావు మాట్లాడుతూ 27రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం పరిష్కరించకపోవడం అన్యాయం అన్నారు. పోరాటానికి యుటిఎఫ్ ఎప్పుడు అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు ఆర్ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి సుబ్బారావు, జిల్లా కౌన్సిలర్ ఎస్‌విడివి ప్రసాద్, వి ఏడుకొండలు, కె శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరావు, ఎన్ సుబ్బారావు, నూతలపాటి రామారావు, సిపిఎం జిల్లా నాయకుడు రాయిని వినోద్ బాబు, సిఐటియు కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి పాల్గొన్నారు.

రేపల్లె : అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో బుర్రకథ చెప్పి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ మాట్లాడుతూ రోడ్డున పడ్డ అంగన్‌వాడిల సమస్యలు తెలియజేస్తూ బుర్రకథ చెప్పినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల బాధలు పట్టిచుకోకుండా బెదిరింపులకి పాల్పడుతుందని అన్నారు. అబద్దాలు ప్రచారం చేయకుండా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. బుర్రకథ ప్రజలను ఆకర్షించింది. సమ్మె శిబిరానికి యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు డి జ్యోతి, నిర్మలజ్యోతి, వై మేరీమణి, విజయలక్ష్మి, దిప్తి, రజని పాల్గొన్నారు.

భట్టిప్రోలు : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలో శుక్రవారం మెడకు ఉరి తాళ్లు వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమాన్నికొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి సుధాకర్, నాగరాజు, అంగన్‌వాడి యూనియన్ నాయకులు రమాదేవి, గృహలక్ష్మి, సూర్య లక్ష్మీ పాల్గొన్నారు.

అద్దంకి : అంగన్‌వాడి కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు 25వ రోజు ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు జి శారద, అనిత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

చెరుకుపల్లి : కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న సమ్మె హక్కును ప్రభుత్వం హరిస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మనిలాల్ అన్నారు. అంగన్‌వాడి కార్యకర్తలు చేస్తున్న దీక్షలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తున్న ప్రభుత్వ చర్యలను ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని కోరారు. కలెక్టర్ ఉత్తర్వుల పత్రాలను దహనం చేశారు.

చీరాల : రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రజలపై భారాలు మోపుతూ సంక్షేమ పథకాల పేరుతో మభ్యపెడుతు, ప్రజలను మోసం చేస్తున్న వైసిపి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు రాష్ట్ర మాజీ కార్యదర్శి వై సిద్దయ్య అన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని తహశీల్దారు కార్యాలయం వద్ద చేస్తున్న నిరసన దీక్షలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రభుత్వంకి ప్రజలపట్ల చిత్తశుద్ధి లేదన్నారు. పోరాటానికి సిఐటియు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు, పి ప్రమీల, జి సుజీవన, ఎ బ్యుల పాల్గొన్నారు.


భట్టిప్రోలులో ఉరితాళ్లతో అంగన్‌వాడీల నిరసన


కొల్లూరులో కలెక్టర్ జిఒలను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు


రేపల్లెలో బుర్రకథ చెబుతూ అంగన్‌వాడీల నిరసన

వంటావార్పుతో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - చీరాల

ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అధికారం వచ్చాక వాటిని గాలికి వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయు రాష్ట్ర నాయకులు వై సిద్ధయ్య అన్నారు. మునిసిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె 11వ రోజుకు చేరుకున్న సందర్భంగా శుక్రవారం వంటా వార్పుతో నిరసన తెలిపారు. రోడ్డుపైనే భోజనాలు చేసి నిరసన తెలిపారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్ మద్దతు తెలిపారు. సిఎం వైఎస్ జగన్ కార్మికులకు ఇచ్చిన హామీలు గాలికొదిలేశారని అన్నారు. కార్పొరేట్ సేవలో ఎన్నికల వ్యూహాలు రచించే పనిలో వున్నారని అన్నారు. రూ.వేల


మున్సిపల్ కార్మికుల ధర్నాలో సిఐటియు నేత వై సిద్దయ్య

కోట్లులో పెట్టుబడి దారులకు రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం కార్మికుల జీతాలు పెంచేందుకు డబ్బులు లేవనడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రజలపై భారాలు అధిక ధరలు, పన్నులు పెంచి ప్రజల గోళ్ల ఊడగొట్టి వసూలు చేస్తున్న ప్రభుత్వం కార్మికుల జీతాలు ఎందుకు పెంచదని ప్రశ్నించారు. ఎన్నికల వేళ ప్రభుత్వం భేషజాలు వెళ్లకుండా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటీయు అధ్యక్ష, కార్యదర్శులు నలతోటి బాబూరావు, ఎం వసంతరవు, ఎఐటియుసి నాయకులు బత్తుల శామ్యూల్, అచ్యుతుని బాబూరావు, కోటి దాసు, సిఐటియు యూనియన్ అధ్యక్షులు వై సింగయ్య, ఎన్ రాజు, ఎం శంకర్, డి మాల్యాద్రి, డి వందనం, బి శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, జి ఇమ్మనియేలు, జి కొటేశ్వరి, జి మేరమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు

నేడు గ్రూప్-2పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఎస్‌జె రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో నేడు గ్రూప్ -2 అవగాహన సదస్సు సాయంత్రం 4:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు, యుటిఎఫ్ సహాధ్యక్షులు బి భిక్షాలు బాబు, జిల్లా కార్యదర్శి షేక్ జానీబాషా తెలిపారు. కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ, విద్యావేత్త, పోటీ పరీక్షలు నిపుణులు కెఎస్ లక్ష్మణరావు గ్రూప్-2 పరీక్ష పట్ల అవగాహన కల్పిస్తారని తెలిపారు. గ్రూప్-2 సిలబస్‌కు సంబంధించిన విషయాలు ప్రామాణికమైన పుస్తకాలు, ప్రిపరేషన్ ప్రణాళిక వంటి అంశాలను బోధిస్తారని అన్నారు. ఎపిపిఎస్‌సి 900ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో చీరాల పరిసర ప్రాంత నిరుద్యోగ అభ్యర్థుల కోసం సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు హాజరైన వారికి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ - ఆంధ్రుల చరిత్ర, భారత సమాజం అనే రెండు పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు.


ఛలో పార్లమెంట్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

12న చలో పార్లమెంట్

ప్రజాశక్తి - రేపల్లె

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యారంగంలో అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాలు ఐక్య సంఘటనగా ఏర్పడి చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్‌కుమార్ తెలిపారు. ఛలో పార్లమెంట్ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కేంద్రంలో రెండోసారి అధికారానికి వచ్చిన బిజెపి జాతీయ విద్యా విధానం 2020తీసుకొచ్చి విచారంగంలో సమూల మార్పులు చేస్తుందని అన్నారు. దీనివల్ల పేదలకు ప్రభుత్వ విద్య దూరం అవుతుందని అన్నారు. విద్యను విదేశీ సంస్థలకు, కార్పొరేషన్ శక్తులకు అప్పగించేందుకు దోహదపడుతుందని అన్నారు. దీనిని దేశవ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఉన్నత విద్యలో అనేక రకమైన మార్పులు చేసి సెంట్రల్ యూనివర్సిటీల్లో ఆర్ఎస్ఎస్ సంస్థల్లో పని చేస్తున్న వ్యక్తులను విసీలుగా, ప్రొఫెసర్లుగా నియమిస్తూ సెంట్రల్ యూనివర్సిటీలను ఆర్ఎస్ఎస్ సంస్థలకు అడ్డాగా, మత సంస్థలుగా మార్చేస్తున్నారని ఆరోపించారు. విదేశీ యూనివర్సిటీలను దేశంలోకి ఆహ్వానిస్తూ చేసిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఇలాంటి అంశాలపై పార్లమెంట్ మార్చి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివశంకర్, రేపల్లె కార్యదర్శి సూర్య ప్రకాష్, హేమ, నాగశ్రీ పాల్గొన్నారు.

11న కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

సంక్రాంతిని సందర్భంగా మండలంలోని వంకాయల పాడులో శ్రీ సాయిరామ గురుకుల్ స్కూలు ఆవరణలో ఈనెల 11, 12తేదీల్లో బాపట్ల, ప్రకాశం జిల్లాల స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ ప్రకటనలో తెలిపారు. హైస్కూలు స్థాయి బాలురకు మాత్రమే పోటీలు జరుగుతాయని అన్నారు. విజేతలకు రు.15,666, రు.10,666, రు.7,666, రు.5,666, రు.3,666 వరుసగా నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఉదయం 9గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

జన సందోహంతో దద్దరిల్లిన కనిగిరి

- పసుపు మయంగా మారిన వీధులు
- లక్ష మందికి పైగా తరలివచ్చిన ప్రజలు
- చంద్రబాబు సమక్షంలో వైసీపీని వీడి టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-కనిగిరి

జన సందోహంతో కనిగిరి పట్టణం దద్దరిల్లింది. స్థానిక వెలుగొండ ప్రాజెక్ట్ సాధన ప్రాంగణంలో రా కదిలిరా ఎన్నికల సమర శంఖారావం ప్రారంభానికి ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. తోరణాలు, టిడిపి జెండాలతో కనిగిరి వీధులు, సభా ప్రాంగణం పసుపు మయంగా మారింది. డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. లక్ష మందికి పైగా ఈ కార్యక్రమానికి తరలివచ్చేలా చేసిన కషి ఫలించింది. చంద్రబాబు పర్యటన బహిరంగ సభ కార్యక్రమం విజయవంతమైంది.

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరికలు

ఎన్నికల సమర శంఖారావం ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో భారీగా వైసీపీని వీడి టిడిపిలో చేరారు. కనిగిరి నియోజకవర్గం లోని ఆరు మండలాల నుంచి వైసీపీ నాయకులు టిడిపిలో చేరారు. చంద్రబాబు నాయుడు వారికి కండువాలు కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు.


చంద్రబాబును చూసేందుకు వచ్చిన జనం


మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


చంద్రబాబుతో సెల్ఫీ దిగుతున్న సినీ గాయని మధు ప్రియ


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఉగ్ర నరసింహారెడ్డి కుమారుడు భరత్ సింహారెడ్డి


మాట్లాడుతున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి- కొండపి

సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి ధనలక్ష్మి అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఆశా వర్కర్ జిల్లా కార్యదర్శి రాగవమ్మ, యానియన్ నాయకులు దైవ సహాయం, సిఐటియు నాయకులు జి.వందనం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మద్దిపాడు : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విధుల్లో చేరాలని అంగన్‌వాడీలకు ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను వారు దహనం చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకా సుబ్బారావు, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీలు ధనలక్ష్మి, జయప్రద, రజిని, లక్ష్మి, నిషా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పి.రూబెన్ నాయకత్వంలో అంగన్‌వాడీలు పాటలతో సిఎం జగన్ వ్యవహార శైలిని ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ప్రభావతి, రమా, ఆశాబి, లక్ష్మిదేవి, సరళ, లలిత, రేణుక, వెంకరత్నం, భాగ్యం, మల్లేశ్వరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


మార్కాపురంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


కంభంలో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

నాగులుప్పలపాడు : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు టి. శ్రీకాంత్ మాట్లాడుతూ అంగన్ వాడీలకు ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హమీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కంభం : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ శుక్రవారం నుంచి విజయవాడలో నిర్వహిస్తున్న 24 గంటల రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయాలన్నారు. శనివారం నుంచి ఒంగోలు కలెక్టరేట్ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలకన్వీనర్ షేక్ అన్వర్ బాషా, ఎఐటియుసి నాయకుడు షేక్ ఇబ్రహీం, సిఐటియు కార్యదర్శి షేక్ ఖాజావలి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెలకు సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం.రఫీ, ఏరియా కో ఆర్డినేటర్ షేక్ అమీర్‌బాషా మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు మల్లేశ్వరి, సుభాషిణి, నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బలు, సునీత, అరుణ, జయమ్మ, నాగరాజకుమారి, సుబ్బులు పాల్గొన్నారు.


వైపాలెంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


మద్దిపాడులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


నాగులుప్పలపాడులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి- కంభం

మండల పరిధిలోని జంగంగుంట్ల హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జంగంగుంట్ల నివాసి అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్న నెమిలిదిన్నె రంగారెడ్డి మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగ రూ.10వేలు, రూ.7,500, రూ.5,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జనార్ధన్ రెడ్డి మిత్రుడు చలమయ్య సహకారంతో విద్యార్థులకు రూ.60 వేల విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సుజాత, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కోటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6 నుంచి క్రికెట్ టోర్నమెంట్


ప్రజాశక్తి- కొమరోలు

సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని పోసుపల్లె గ్రామంలో 6 నుంచి గిద్దలూరు నియోజక వర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25,016, ద్వితీయ బహుమతిగా రూ.15,016 నగదు బహుమతిని వైసిపి గిద్దలూరు నియోజక వర్గ నాయకుడు కామూరి రమణారెడ్డి సహకారంతో అందిస్తున్నట్లుగా తెలిపారు. ఆసక్తి కలిగిన టీములు తమ పేర్లను నమోదు చేయించు కోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 80743 06402, 99120 78372 సెల్‌నంబర్లను సంప్రదించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మార్కాపురం పట్టణ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సిఐ ఆవుల వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించారు. సాధన డిగ్రీ కళాశాల, సాధన జూనియర్ కళాశాల, ఎన్‌జిఒ హోం, మున్సిపల్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని కరెంట్, ఫర్నిచర్ , నీటివసతి, మూత్రశాలలు, వద్దులు, వికలాంగుల కోసం ర్యాంపులను, పోలింగ్ కేంద్రాల ప్రహరీలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కోటేశ్వరరావు. బిఎల్‌ఒలు, పోలీస్ సిబ్బంది, విఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

చంద్రశేఖర్‌కు అభినందనలు


ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండకు చెందిన తాటిపర్తి చంద్రశేఖర్‌ను యర్రగొండపాలెం వైసిపి అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్ మొట్ట మొదటిసారిగా తన సొంత గ్రామమైన శింగరాయకొండకు శుక్రవారం వచ్చారు. అందులో భాగంగా సుందర్ నగర్‌లోని ఆయన నివాసం వద్దకు వైసిపి నాయకులు భారీగా తరలివచ్చి అభినందనలు తెలియజేశారు. కొండపి, కందుకూరు, ఒంగోలు, యర్రగుంటపాలెం నియోజకవర్గాల నుంచి వైసిపి నాయకులు విచ్చేసి చంద్రశేఖర్‌ను సత్కరించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా రావడంతో చంద్రశేఖర్ నివాసం వద్ద కోలాహాలం నెలకొంది.

వైసిపి పాలనంతా సంక్షేమమే: ఎమ్మెల్యే రఘుపతి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

వైసీపీ ప్రభుత్వం పాలన అంతా సంక్షేమమేనని ఎమ్మెల్యే కోనా రఘుపతి అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో జరిగిన పెన్షన్ కానుక పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. కొత్తగా మంజూరైన పెన్షన్లు లబ్ధిదారులకు అందజేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లుగా పెన్షన్‌ను దశల వారీగా పెంచుకుంటూ రూ.3వేలు చేశారని అన్నారు. గతంలో అరకొరగానే పెన్షన్ పథకం ఉండేదన్నారు. ఇప్పుడు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని అన్నారు. గతంలో పథకాలు రావాలంటే అధికార పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. నేడు సచివాలయాల్లోనే అర్హతలను పరిశీలించి అన్నీ పథకాలను లబ్దిదారులకు ,అందిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో 6735 మందికి సామాజిక పెన్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ల కోసమే రూ.కోటి 85 లక్షలు ఖర్చు చేస్తుందని చెప్పారు. అభివృద్ధి పనులు సైతం నిరాఘాటంగా జరుగుతున్నాయని అన్నారు. గతంలో ఒక చిన్న పట్టణంగా ఉన్న బాపట్ల నేడు నగరం రూపు సంతరించుకుందని చెప్పారు. విశాలమైన రోడ్లు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు, జాతీయ రహదారులు, ప్రభుత్వ వైద్య కళాశాల వంటి నిర్మాణాలు చకచగా జరిగిపోతున్నాయని అన్నారు. అభివృద్ధి ఫలాలు పూర్తిగా పొందాలంటే మరికొన్నాళ్లు వేసి చూడాలని అన్నారు. అభివృద్ధి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలంటే వైసిపి ప్రభుత్వానికి మళ్లీ ప్రజలు పట్టం కట్టాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో సిఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, బాపట్ల ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, వెంకటరమణ, వైసిపి పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్, వైసిపి నాయకులు చల్లా రామయ్య, కదిరిన్ రాజా, షేక్ పీరు పాల్గొన్నారు.



పెన్షన్ అందజేస్తున్న ఎంఎల్ఎ కోన రఘుపతి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్ : ఆమంచి



పెన్షన్ అందజేస్తున్న మాజీ ఎంఎల్ఎ ఆమంచి కృష్ణమోహన్

ప్రజాశక్తి - పర్చూరు

అవ్వా, తాతల దశ మారిపోయిందని వైసిపి ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. వారికి ఇస్తున్న పింఛన్ రూ.3వేలకు పెంచుతూ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో ఆనందానికి అవధులు లేవని అన్నారు. స్థానిక ఎంపియుపి పాఠశాలలో శుక్రవారం జరిగిన నూతన పింఛన్ల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం వృద్ధులకు కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇచ్చిందని గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం మాత్రమే పింఛన్లను రూ.రెండు వేలకు పెంచిందని విమర్శించారు. జగన్ ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా పింఛన్లను దశల వారీగా పెంచినట్లు తెలిపారు. రాష్ట్రం అనేక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పింఛన్లను మాత్రం ఆపలేదని అన్నారు. కరోనా సమయంలో దేశంలోని అనేక రాష్ట్రాలు పలు సంక్షేమ పథకాలను ఆపేసినా జగన్ మాత్రం కొనసాగించారని చెప్పారు. పింఛన్ దారుల్లో ఎవరైనా చనిపోతేనే తప్ప టీడీపీ ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వలేదని విమర్శించారు. నేడు పెరిగిన పింఛన్లతో అవ్వా, తాతలు చాలా సంతోషంగా ఉన్నారని ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో 8749 మంది లబ్ధిదారులకు నెలకు రూ.2.59కోట్ల నగదు పింఛన్ల రూపంలో పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కటారి అప్పారావు, కోటా హరిప్రసాద్, సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్య, ముప్పాళ్ల రాఘవయ్య, గోరంట్ల శివకుమారి, తులసి నాగమణి, కోటా శ్రీనివాసరావు, షేక్ అహ్మద్ బాష, షేక్ కాలేష, గాదె సురేష్, ఆకుల హేమంత్, కంచెనపల్లి రమేష్, మల్లా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గౌస్ మోహిద్దీన్ పాల్గొన్నారు.

కారంచేడు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను ఎంపిపి నీరుకట్టు వాసుబాబు పంపిణీ చేశారు. మండలానికి 276నూతన ఫించన్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి నారాయణ, ఈఓఆర్డి ఆర్ రమేష్ బాబు, కోఆప్షన్ సభ్యులు ముల్లా నూర్ అహ్మద్, వైసీపీ నాయకులు దండ చౌదరి బాబు, సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అద్దంకి : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు వినియోగించు కోవాలని వైసిపి ఇన్చార్జి పానెం హనిమిరెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రూ.3వేలకు పెంచిన పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి పరిశీలకులు మారం వెంకారెడ్డి, ఎంపిపి అవిశన జ్యోతి, ఎంపిడిఓ దేవసేన కుమారి, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, వైసిపి మండల కన్వీనర్ పాల్గొన్నారు.

వేమూరు : చుండూరులో వైఎస్సార్ ఫంక్షన్ కానుకను వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జాలాద్ రూబెన్, చుండూరు సర్పంచ్ ఉయ్యూరు అప్పిరెడ్డి, ఎంపిడిఓ సుగుణమ్మ, తహశీల్దారు కనకదుర్గ పాల్గొన్నారు.



పెన్షన్ అందజేస్తున్న వైసిపి అద్దంకి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి

పారిశుధ్య కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

వేతనాలు ఇవ్వాలని కోరుతూ గత 14రోజులుగా ఇంకొల్లు పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేస్తున్న పోరాటం అధికారుల రాతపూర్వక హామీతో శుక్రవారం నుండి తాత్కాలికంగా విరమించారు. పంచాయతీ కార్యదర్శి కోటి నాగయ్య ఈనెల 12న కార్మికులకు రావలసిన బకాయిలు ఇస్తామని, రెండేళ్ల నుండి బట్టలు, శానిటైజేషన్ సామాగ్రి కూడా ఇస్తామని గ్రామసభ సాక్షిగా లిఖితపూర్వకంగా అంగీకరించారు. గ్రామ సభ జరుగుతున్న సందర్భంలో పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. గ్రామ ప్రజలు, వార్డు మెంబర్లు కార్మికుల పక్షాన నిలబడి అడిగటంతో పంచాయతీ కార్యదర్శి కార్మికుల డిమాండ్స్ అన్నిటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 12నాటికి పూర్తిగా పరిష్కరిస్తామని గ్రామ ప్రజలు ఎదుట రాసి ఇవ్వటంతో నిరసన దీక్షకు విరామం ప్రకటించారు. శనివారం నుండి కార్మికులు విధులకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, జిల్లా సహాయ కార్యదర్శి జి ప్రతాప్ కుమార్, బాబు, పారిశుధ్య కార్మికులు పి వెంకటేశ్వర్లు, కె సత్యానందం, ఎం కోటి నాగరాజు, నాగేశ్వరరావు, రాఘవేంద్రరావు, కృపారావు, ఆదాం, దాసు, వసుంధర, దేవి, కాలేబు పాల్గొన్నారు.



వేతనాలు మంజూరుపై కార్మికులకు అధికారుల హామీ

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - అద్దంకి

తెలుగు వారికిష్టమైన సంక్రాంతి పండుగను సందర్భంగా పట్టణంలోని బంగ్లా రోడ్ లోని భాష్యం పాఠశాల్లో 1నుండి 5వ తరగతి విద్యార్థులకు, తల్లులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం కాకాని ల్పనా మాట్లాడుతూ తెలుగు వారి సాంప్రదాయ సంక్రాంతి పండుగ అంటేనే పిల్లలు ఎంతో ఉత్సాహంగా కొత్త దుస్తులు, ఆటలు, గాలి పటాలు ఎగుర వేస్తూ సరదా సరదా గా చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జివిఎస్ఆర్ శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మార్పు సంస్థ ప్రతినిధులు

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

మార్పు సేవా సంస్థ ఆధ్వర్యంలో గౌంజ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో వాడరేవులోని తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఆ ప్రాంతంలో నెలకొని ఉన్న అపరిశుభ్రతను గ్రామస్తులచే సంస్థ ప్రతినిధులు తొలగించారు. సంస్థ ప్రతినిధులు మార్పు గ్రేగోరి, సుశీల్ కుమార్, ప్రేమ్ కుమార్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాల గురించి గ్రామస్తులకు వివరించారు. తుఫాన్ బాధితులను ఆదుకోవడం తమ సంస్థల అజెండాని తెలిపారు. మించిన్ తుఫాను ప్రభావం అధికంగా జిల్లాపై పడిందని తెలిపారు. దీంతో తీర ప్రాంతాలలో బాధితులకు చేయూతగా నిలిచేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. పాకల, ఎస్సీ కాలనీ, సునామీ కాలనీ, లేప్రసి కాలనిల్లో 700 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.1500విలువ కలిగిన నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సాయాన్ని పొందే వారు విధిగా పరిశుభ్రత పట్ల పూర్తి బాధ్యత కలిగి ఉండాలని అన్నారు. వీధిలో నెలకొన్న అపరిశుభ్రత వాతావరణం తొలగిస్తే సంస్థ ఉద్దేశం నెరవేరుతుందని అన్నారు. చేగూడి సురేష్, మాజీ సర్పంచ్ ఏరిపిల్లి రమణ, అక్కల శ్రీనువాసరెడ్డి, మచ్చా సువార్త, మార్పు విన్సెంట్ పాల్, జోతుల ప్రకాష్, చేగూడి జాన్సన్, మార్పు వంశీ, పారా నాగేశ్వరావు, చింత సత్యం, మార్పు సుధా, మార్పు రోసియ్య, దేవరపల్లి దిలీప్, మార్పు సురేష్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో ప్రత్యేకాధికారి జెడి హనుమంతరావు

నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జగనన్న కాలనీలో టార్గెట్‌కు అనుగుణంగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి జెడి హనుమంతరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎవరికి వారు తీసుకున్న టార్గెట్లకు అనుకూలంగా లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం నుండి బిల్లులు మంజూరయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సైతం ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తోడ్పాటు ఇచ్చి సమన్వయంతో పని చేయాలన్నారు. బేస్మెంట్ స్థాయికి ముందే డ్వాక్రా గ్రూపుల ద్వారా రూ.35వేల రుణాలు అందిస్తున్నామని తెలిపారు. వాటితో బేస్మెంట్ పూర్తికాగానే ప్రభుత్వ బిల్లుకు సిఫారసు చేయాలని సూచించారు. కాలనీలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మ చంద్రశేఖర్, గృహ నిర్మాణ శాఖ ఏఈ రావూరి సౌమ్య రేవతి, పిఆర్ ఏఈ రామచంద్రరావు, ఏపిఎం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



నిరసన దీక్షలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు

చీకటి చట్టాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

భూమి లైటిల్ చట్టం వంటి చీకటి చట్టాలను రద్దు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంకు 9వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు బూర్లే ఉదయ్ శంకర్, కేసన జగదీష్, ఆళ్ళ సూరిబాబు, ఎడ్ల గోపిరాజు, దీపాల ప్రసాదు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాది దారం సాంబశివరావు మాట్లాడుతూ ఏపీ టైటిలింగ్ యాక్ట్ 27/22 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక, చీకటి చట్టాల వల్ల న్యాయస్థానాల మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మానుకొని ప్రజా వ్యతిరేక చట్టాలను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేసన గోపాలరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి న్యాయస్థానాలపై నమ్మకం లేదని, హిట్లర్ మాదిరిగా ఆక్రమించుకున్న అక్రమాస్తులను కాపాడుకోవడానికే ఇటువంటి చట్టాలను తెచ్చిందని అన్నారు. రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, రైతులు, ప్రజలను చైతన్యం చేస్తామని హెచ్చరించారు.

మద్యం నిల్వలపై దాడులు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్



మద్యం స్వాదీనం చేసుకున్న సిఐ

అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉంటే చర్యలు తప్పవని సెబ్ సీఐ సుంకర శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని స్టువర్ట్పురం గ్రామంలో శుక్రవారం దాడులు చేశారు. సారా తయారీకి సిద్దం చేసిన 700లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బసివిరెడ్డిపాలెంలో మహిళ వద్ద మద్యం సీసాలు కలిగి ఉండటంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 16మద్యం బాటిళ్ల స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీని సాగనంపుదాం

శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్రాన్ని భ్రష్ట పట్టించి, సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని ఎంఎల్ఎ అనగానీ సత్యప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో దోపిడీ, అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలు కనిపిస్తున్నాయి తప్ప అభివృద్ధి శూన్యంగా మారిందని అన్నారు. ఏ గ్రామంలో చూసినా వైసీపీ ప్రభుత్వాన్ని చీదరించుకునే స్థాయికి వెళ్ళిందంటే పరిపాలన ఏవిధంగా ఉందో స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు. సీఎం జగన్ హాయంలో దోచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని అన్నారు. 2024ఎన్నికల్లో వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని అన్నారు. ప్రతి కార్యకర్త ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. అక్రమాలుంటే సంబంధింత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. టిడిపి పాలనలో 150పథకాలతో ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించామని అన్నారు. 56కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన వైసిపి ప్రభుత్వం ఒక్కరికి కూడా లబ్ధి చేకూర్చలేదని ఆరోపించారు. ఉద్యమాల పేరుతో ప్రజలను మోసాగించి వ్యక్తి గత లబ్ధి పొందిందన నాయకులు బిసిల హక్కుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, సర్వ శిక్ష అభియాన్ ఇలా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆందోళన చేపట్టటం ప్రభుత్వ చేతగాని పాలనా తీరుకు నిదర్శనం అన్నారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బెదిరించాలని చూడటం అవివేకం అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు 2018జూలైలోనే అంగన్‌వాడీలకు రూ.10,500 వేతనం ఇచ్చారని గుర్తు చేశారు. టిడిపి పాలకులు ఎన్టీ రామారావు, చంద్రబాబు ప్రజాకర్షణ పాలన అందించారని చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో టిడిపి, జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. వైసిపి మోసపు మాటలు నమ్మలేక ప్రజలు స్వచ్ఛందంగా టిడిపిలోకి వస్తున్నారని అన్నారు. ప్రతిఒక్కరికి టిడిపి ఆహ్వానం పలుకుతుందని అన్నారు. టిడిపి అధికారంలో ఉన్న కాలంలో నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు తెలిపారు.



విలేకర్ల సమావేశంలో ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్



ఎంఎల్ఎ సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ప్రజాశక్తి -రేపల్లె

ప్రజలు పెద్ద ఎత్తున టిడిపిలో చేరటం శుభసూచకమని ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పట్టణానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యని భావించిన ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా టిడిపిలోకి వస్తున్నారని చెప్పారు. సమిష్టిగా పని చేసి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. పట్టణానికి చెందిన ల్యాబ్ కిషోర్, షేక్ గౌస్ పీర్, 6వ వార్డుకు చెందిన కరీముల్లా, చావలి సాయి, చెన్ను బాలకృష్ణ, యూసీన్, అంకెం మర్రీకృష్ణ, కైతేపల్లి శ్రీనివాసరావు, అభినయ్, 2వ వార్డుకు చెందిన సంషీర్ బేగ్ వైసిపి నుండి టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాతా ఏడుకొండలు, డొక్కు బుజ్జి, డొక్కు అయ్యా, మొబ్బిన్, నర్రా సుబ్బయ్య పాల్గొన్నారు.



పెన్షన్ అందజేస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణమూర్తి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - చీరాల

పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్దిదారులకు స్థానిక ఎన్ఆర్‌పిఎం ఉన్నత పాఠశాల ఆరణలోని ఒఎటిలో ఏర్పాటు చేసిన సభలో శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలో 11714మంది లబ్ధిదారులకు రూ.3.34కోట్ల నగదు నేరుగా లబ్ధిదారుడి గడప వద్ద అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సరిజిని, ఎంపీడీఓ నేతాజీ, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైసిపి మండలం అధ్యక్షులు ఆసాధి అంకాల రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ జైసన్ బాబు, వైసిపి జిల్లా కార్యదర్శి బండారు శివ పార్వతి, పిఎసిఎస్ చైర్మన్ బోయిన కేశవులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిభిరాన్ని డిఎం అండ్ హెచ్ఒ విజయమ్మ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిభిరంలో రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరమైన ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యశాల సుపరెంటిండెంట్ గురుమహేశ్వరరెడ్డి, ఎంపిడిఓ ప్రద్యుమ్న కుమార్, ఈఒఆర్డీ గౌస్, కార్యదర్శి ఎస్‌కె గౌస్ మొహిద్దీన్, డాక్టర్ డి కృష్ణజ్యోతి, డాక్టర్ ఇ సింధు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మండలంలోని నాగండ్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షా 2.0 వైద్య శిబిరాన్ని సర్పంచ్ కంచుగంటి పద్మ శుక్రవారం ప్రారంభించారు. శిభిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపిడిఒ ఆర్‌వి రాజ్యలక్ష్మి, ఇఒ పిఆర్‌డి ఎ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వైద్యశిభిరం ప్రారంభిస్తున్న నాగండ్ల సర్పంచి కె పద్మ



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్‌సి సంక్షేమ సంఘం నేతలు

భవనానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర షెడ్యూలు కులాల సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయం ఏర్పాటుకు 20సెంట్లు భూమిని కేటాయించాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నక్క కాంతారావు కలెక్టర్ రంజిత్ భాషాకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యాలయానికి ప్రభుత్వం గుంటూరు ఏసి కళాశాల ఎదురు కేటాయించిన స్థలంలో రాజ్యసభ సభ్యులు జెడి శీలం సమకూర్చిన నిధులతో భవనాన్ని నిర్మించుకున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో షెడ్యూలు కులాల సంక్షేమ సంఘానికి సొంత స్థలం కేటాయించాలని కోరారు.

వైసిపిపై తిరుగుబాటు : నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజల్లో వైసిపి ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ప్రతి ఇంటికి టిడిపిని చేరువ చేయడమే లక్ష్యంగా మురుకొండపాడులో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో వైసీపీ ప్రభుత్వం పతనం ఖాయమన్నారు. వైసిపి పాలనలో మురుకొండపాడు గ్రామం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. గ్రామంలో విష జ్వరాల బారినపడి ఇబ్బందుల పాలైన ప్రజలను పట్టించుకోలేదని అన్నారు. జగన్ అరాచక పాలనకు తగిన గుణపాఠం చెపుతారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ నక్కల వీరరాఘవయ్య, టిడిపి మండల అధ్యక్షులు ముక్కామల శివ పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి నరేంద్రవర్మ



వికసిత్ యాత్రలో రాజ్యసభ సభ్యులు బాబుదేశాయ్

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - మేదరమెట్ల

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం స్థానిక ఎఎంసి ఆవరణలో జరిగిన సభలో గుజరాత్ రాజ్యసభ సభ్యులు బాబు భాయ్ దేశాయ్ మాట్లాడారు. దేశంలో ప్రధాని మోడీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక రంగాల్లో గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. మోడీ మాటలవాడు కాదని, చేతలవాడిగా మనం చూస్తున్నామని అన్నారు. కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సంకల్పయాత్ర ఇంచార్జ్ రాంబాబు, కోఆర్డినేటర్ పి అను ప్రసాద్, బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డ లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, ఎంపీడీఓ డి సురేష్ బాబు, ఈఒఆర్‌డి పి ఓబులేష్, సర్పంచ్ బునిగల ఎలిసెమ్మ, పంచాయతి సెక్రటరీ జమలమూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, ఎపీఎంబి అనురాధ, ఏపీఒ కోటేశ్వరి, ఐసిడిఎస్ సిడిపిఒ ఎ కృష్ణకుమారి, సూపర్వైజర్స్ కె ఇందిరా, అరుణాదేవి పాల్గొన్నారు.

పార్లమెంట్ సీటు స్థానికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

పార్లమెంటు ఎంపీ సీటును స్థానికులకే కేటాయించాలని బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ గుదే రాజారావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. కేంద్రం నుండి రావాల్సిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.2వందల కోట్లు తీసుకురావడంలో ఎంపీ నందిగం సురేష్ పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి దోహదపడలేదని అన్నారు. స్థానికేతర నాయకులకు సీటును కేటాయించవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కెఎన్‌పిఎస్ జిల్లా కార్యదర్శి కోలా శరత్, దాసరి లక్ష్మి, ఎస్‌కె సుభీర్, కాగిత వీరయ్య పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నేతలు

గాలికుంటు పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పశువులకు సంక్రమించే గాలి కుంటి వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జెడి ఎం హనుమంతరావు సూచించారు. శుక్రవారం మట్టిపురంలో గుంటూరు డిడిఎల్ సహకారంతో గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ ను అందజేశారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రేపల్లె సహాయ సంచాలకులు టి నరేంద్రబాబు మాట్లాడుతూ గాలి కుంటి వ్యాధి చాలా ప్రమాదకర మైనదని అన్నారు. దీనివలన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. రైతులు దీనిని గమనించి సంబంధిత వైద్యులతో వ్యాక్సినేషన్ వేయించుకోవాలని అన్నారు. నాలుగు నెలల దూడ నుండి ప్రతిదానికి ఈ వ్యాక్సిన్ అందిస్తున్నట్లు చెప్పారు. వ్యాక్సినేషన్ అనంతరం ఫ్రీ సిరా శాంపిల్స్ సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడి డిఏ డి శ్రీలక్ష్మి, పశు వైద్యాధికారి లక్ష్మి రంజిత పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్ పరిశీలిస్తున్న జెడి


వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పర్చూరు

ఆదివారం ప్రభువు యేసుక్రీస్తు పునరుద్ధరించిన దినమని, ఆరోజు జరిగే ప్రార్థనలో అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని రెవరెండ్ డాక్టర్ లూథర్ శాస్త్రి క్రైస్తవ సోదరులకు సూచించారు. అందరూ దేవునిపై విశ్వాసం కలిగి ఉండాలని కోరారు. వార్షిక క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. గాస్పెల్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పుటూరులోని మన్నా ఫెయిత్ గాస్పెల్ చర్చిలో సమావేశం నిర్వహించారు. చర్చి ప్రతిష్టా వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని పాస్టర్లందరు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లందరికి దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గాస్పెల్ పాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షులు షాలెం రాజు, ఉపాధ్యక్షులు బి పాపారావు, కార్యదర్శి శాంత కుమార్, సంయుక్త కార్యదర్శి శామ్యూల్ పాల్, ట్రెజరర్ శామ్యూల్ రాజు, గౌరవాధ్యక్షులు ప్రేమయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లూథర్‌శాస్త్రి



ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, ఎంపీ మాగుంటతో కార్పొరేటర్లు

ఒంగోలు నుంచే పోటీ చేయండి

- బాలినేని శ్రీనివాసరెడ్డిని కోరిన కార్పొరేటర్లు
- పట్టాలిచ్చాక మాట్లాడదామన్న బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'మీరు ఒంగోలు నుంచే పోటీ చేయండి.. అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటాం' అని ఒంగోలు నగరానికి చెందిన అధికార పార్టీ కార్పొరేటర్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కోరారు. హైదరాబాద్‌లో ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డిని మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో నగరానికి చెందిన అధికార పార్టీ కార్పొరేటర్లు శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి గిద్దలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని అధిష్టానం సంకేతాలు ఇస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ కార్పొరేటర్లు అంతా బాలినేని శ్రీనివాసరెడ్డిని ఒంగోలు నుంచే పోటీ చేయాలని పట్టుబట్టారు. ఈవిషయంపై స్పందించిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలులో ఇరవై ఐదు వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తానని చెప్పానని, పట్టాలు ఇచ్చిన తరువాత మాట్లాడదామని ఆయన కార్పొరేటర్ల ప్రతిపాదనకు సున్నితంగా సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఇదే సమయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కూడా బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసేందుకు ఆయన నివాసానికి వెళ్లారు. దీంతో కార్పొరేటర్లు ఎంపీ మాగుంటను కూడా కలిశారు. మీరిద్దరూ ఒంగోలు నుంచి పోటీలో ఉంటే బాగుంటుందని కార్పొరేటర్లు వారిద్దరినీ కోరినట్లు తెలిసింది. హైదరాబాద్ వెళ్లిన వారిలో మేయర్ గంగాడ సుజాతతో పాటు డిప్యూటీ మేయర్లు వేమూరి బుజ్జి, వెలనాటి మాధవరావు, అధికారపార్టీ కార్పొరేటర్లు, పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

ధృతరాష్ట్ర పాలనలా ఉంది..

కళ్లు మూసుకొని అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి-బాపట్ల

అంగన్‌వాడీల సమస్యలు పట్టించుకోని జగన్ గుడ్డి ప్రభుత్వానికి గడ్డుకాలం దాపరించిందని బాపట్లలో అంగన్వాడీల ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ వ్యవహారం ధృత రాష్ట్ర పాలనలా ఉందంటూ.. అంగన్‌వాడీలు రెండు చేతులతో కళ్ల మూసుకొని నిరసన తెలియజేశారు. అంగన్వాడీల సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి స్వయంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నప్పటికీ కనికరం లేకపోవడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే నిరాహార దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు. శనివారం నుండి బాపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద నుండి సమ్మె శిబిరాన్ని క్రీడా ప్రాంగణం భవనం ఎదురు ఏర్పాటు చేసుకొని నిరాహార దీక్ష చేపడతామని తెలిపారు.



ఒంగోలులో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కొనసాగుతున్న సమ్మె

ఒంగోలు కలెక్టరేట్: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. అంగన్‌వాడీల నిరవధిక సమ్మె శుక్రవారం 25వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. న్యాయమైన డిమాండ్లను చర్చల పేరుతో ప్రభుత్వం, మంత్రులు కాలయాపన చేస్తున్నారన్నారు. న్యాయమైన డిమాండ్లు సాధించుకునేంత వరకు అంగన్‌వాడీలు ఉద్యమాన్ని కొనసాగించాలని, సిఐటియు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలన్నారు. సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కెవి సుబ్బమ్మ, కె.ప్రశాంతి, పద్మ, నిర్మల, హేమీమా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సిఎం సహాయనిధి మంజూరు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విజయవాడ ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన బస్సు ప్రమాద దుర్ఘటనలో మతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నగదు విడుదలైందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఇటీవల విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన ప్రమాదంలో జిల్లాలోని ఇద్దరు వ్యక్తులు మతి చెందారన్నారు. ఆ కుటుంబాలకు రూ.20 లక్షల నగదును మంజూరు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఆ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును కలెక్టర్ అందజేశారు. చీరాలకు చెందిన 45 ఏళ్ల మౌటాని కుమారి మతిచెందగా ఆమె కుమారుడు మౌటాని కిషోర్ బాబుకు రూ.10 లక్షలు అందించారు. జె పంగులూరు మండలానికి చెందిన ఏడు నెలల కాటీ అహన్ అలియాస్ చెర్రీ మతి చెందగా తల్లి ఝాన్సీ రాణికి రూ.10 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కె.గోపికష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వంటావార్పు

- ఇంటింటికీ తిరిగి భిక్షాటన
- సమ్మెకు ప్రజల మద్దతు కోరుతూ కరపత్ర ప్రచారం



ఒంగోలులో మున్సిపల్ కార్మికుల భిక్షాటన

ప్రజాశకి-ఒంగోలు సబర్బన్

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 11వ రోజుకు చేరింది. 11వరోజు సమ్మెలో భాగంగా కార్మికులు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు కార్మికులు వారు పనిచేసే ప్రాంతాలకు వెళ్లి న్యాయమైన తమ పోరాటానికి మద్దతు తెలపాలని ఇంటింటికీ తిరిగి కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఇళ్లు, షాపుల వద్దకు వెళ్లి భిక్షాటన చేపట్టారు. తాము ఎందుకు సమ్మె చేస్తున్నామనే విషయాన్ని ప్రజలకు వివరించి వారి మద్దతు కోరారు. పెరిగిన నిత్యావసర ధరలు, కరెంటు బిల్లులు, స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు, గ్యాస్ ధరల పెంపు కారణంగా తమకు వచ్చే జీతాలు ఏమూలకూ సరిపోవడం లేదని ప్రజలకు విడమరిచి చెప్పారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తమను పర్మినెంట్ చేస్తామని, లేని పక్షంలో సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, ఆయన ఇచ్చిన హామీ అమలు చేయాలని తాము అనేకసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు, మంత్రులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. అందుకే తాము సమ్మె చేస్తున్నామని కార్మికులు ప్రజలకు విపులంగా చెప్పడంతో ప్రజల నుంచి కార్మికులకు ఆదరణ లభించింది. సమ్మెను ఉద్దేశించి వంటావార్పు కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా పోటీ కార్మికులను పెట్టి సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు చేస్తోందన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా జగన్ ప్రభుత్వం సీట్లు సర్దుబాటు చేసుకోవడానికి జల్లెడ పడుతోందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని సైతం ప్రభుత్వం లెక్క చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, ఎస్‌డి హుస్సేన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, యు కుమారి, రాగి రాములు, కె మోహన్‌రావు, ఆర్ శ్రీనివాసరావు, కె వెంకటేశ్వర్లు, ఎం లక్ష్మీ కాంతం, జి నరసింహం, టి విజయమ్మ, కె బాలకృష్ణ; ఎం శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలోనూ వంటావార్పు

బాపట్ల: బాపట్లలో మున్సిపల్ కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరింది. శుక్రవారం పారిశుధ్య కార్మికులు వంటావార్పుతో తమ నిరసన తెలియజేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని కార్మికులు



బాపట్లలో వంటావార్పు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమ్మెను మరింత ఉధ తం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు డి. మాల్యాద్రి, పి. అంకమ్మరావు, ఎన్ సత్యవతి, దళాయి దుర్గారావు, సాల్మన్, శారద, పద్మావతి, నాగమణి, గోపమ్మ, లక్ష్మి, ఎలిజిబెత్ రాణి, ములక అంకాలు, నరసింహారావు నాయకత్వం వహించారు.

మార్కాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరం కొనసాగుతోంది. శుక్రవారం నాటికి సమ్మె పదకొండో రోజుకు చేరింది. కార్మికులకు మద్దతుగా సిఐటియు జిల్లా నాయకులు డి.సోమయ్య మాట్లాడారు. సమ్మెకు కె.సుబ్బరాయుడు, గొట్టం హరికష్ణ, చెన్నకేశవులు, నరేష్, అందే చిన్న నాసరయ్య, తప్పెట్ల శ్రీనివాసులు, కరిముల్లా, జార్జి, గురునాథం తదితరులు నాయకత్వం వహించారు.

పొర్లుదండాలతో కార్మికుల నిరసన

చీమకుర్తి: మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా 11వ రోజు పొర్లు దండాలతో కార్మికులు నిరసన తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పి.ఏడుకొండలు, పి పద్మ, ఎ.కోటేశ్వరరావు, కోటేశ్వరి, సురేఖ, ఆంద్రి, గోవిందు, చెన్నమ్మ, విజయ పాల్గొన్నారు.

7న చెకుముకి సైన్స్ సంబరాలు

ఒంగోలులోని శ్రీ హర్షిణి కాలేజిలో నిర్వహణ



మాట్లాడుతున్న పుల్లారావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఏడుగుండ్లపాడు శ్రీహర్షిణి జూనియర్ కళాశాలలో ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ సలహాదారులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వి.పుల్లారావు, సి.హెచ్.జయప్రకాశ్ తెలిపారు. శుక్రవారం ఎల్‌బిజి భవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. గత నెలలో జరిగిన మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షల లో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల విభాగాలలో మొదటి స్థానం సాధించిన పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి సంబరాలకు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి విఎస్. సుబ్బారావు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులలో మూఢనమ్మకాల పట్ల అవగాహన కల్పించి వాటిని నిర్మూలించేందుకు, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు, వారిలో దాగి ఉన్న సజనాత్మక శక్తిని వెలికితీసేందుకు జెవివి కషి చేస్తోందన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జెవివి చేస్తున్న కషిలో భాగంగా నిర్వహిస్తున్న ఈ చెకుముకి సైన్సు సంబరాలను జయప్రదం చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జెవివి కార్యకర్తలను వారు కోరారు. సమావేశంలో జెవివి నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యస్‌వి రంగారెడ్డి, ఎన్‌టి వెంకటేశ్, నగర ఉపాధ్యక్షులు డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొమ్మమూరు కాలువకు నీరు విడుదల

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కొమ్మమూరు కాలువకు ఎట్టకేలకు నీరు విడుదలైంది. కారంచేడు, చీరాల, వేటపాలెం, చిన్నగంజాం, నాగులుప్పలపాడు మండలాల పరిధిలో ఉన్న కొమ్మమూరు కాలువ కింద సుమారు 30 వేల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో పొట్ట దశలో ఉన్న వరి పంటకు నీరు ఇవ్వాలని రైతుసంఘాల నాయకులు ఈఈని కలిశారు. అదేవిధంగా చీరాల శాసన సభ్యులు కరణం బలరామకష్ణమూర్తి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున, తిమ్మసముద్రం మాజీ సర్పంచ్ కరణం రమేష్‌బాబు, రైతులు ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించారు ప్రస్తుత పరిస్థితుల్లో 30 వేల ఎకరాలు పొట్టదశలో ఉన్నాయని, కనీసం రెండు తడులు అందిస్తే పంట చేతికి వస్తుందని, లేకుంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని తెలిపారు. నాగార్జునసాగర్ నుండి నీరు విడుదల కావడం లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దీంతో ఇఎన్‌సి నారాయణరెడ్డి స్పందించి పులిచింతల నుండి కొమ్మనూరు కాలువకు నీరు విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేయాలని ఆదేశించారు. దీంతో కొమ్మమూరు కాలువకు నీరు చేరింది. శనివారం ఉదయానికి ఈ ప్రాంతానికి నీరు చేరుతుందని అధికారులు తెలిపారు. దీంతో రైతాంగం ఊపిరి పీల్చుకున్నారు.